అనుదినం జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
సోమవారం 10 జులై 2023

పురివిప్పి నెమలి నాట్యం

నవతెలంగాణ-రెంజల్

రెంజల్ మండలంలోని దర్గా సమీపంలో నెమలి నాట్యం చేస్తూ పురివిప్పగా, రోడ్డుపై వెళ్లే ప్రజలు ఆసక్తికరంగా తిలకించారు. సాయంకాలం వేళల్లో విశాలమైన వక్ఫ్ బోర్డ్ భూములలో నెమళ్ల తిరుగుతూ పురివిప్పి నాట్యం చేశాయి. రోడ్డుపై ద్విచక్ర వాహనంలో వెళ్లే వారు సైతం వాహనాలను నిలిపివేసి ఆహ్లాకదర దృశ్యాన్ని తమ ఫోన్‌లలో బంధించారు.


పురివిప్పి నాట్యం చేస్తున్న నెమలి

గల్ఫ్ బాధితుడి అంత్యక్రియలకు ఆర్థిక సహాయం

నవతెలంగాణ-రామారెడ్డి

గల్ఫ్‌లో మృతి చెందిన ఉప్పల్వాయి గ్రామానికి చెందిన పురం సిద్ధిరాములు మృతదేహం ఆదివారం గ్రామానికి చేరుకోగా, గ్రామస్తులంతా కలిసి అంత్యక్రియలకు రూ 30,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. గ్రామ సర్పంచ్ కొత్తొల్ల గంగారం, రైతుబంధు అధ్యక్షులు నారాయణరెడ్డి, మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు, అంత్యక్రియలో పాల్గొని, శవపేటికను మోశారు. కార్యక్రమంలో గ్రామస్తులు పరవా రెడ్డి, ఆకుల లింగం, పల్లె నర్సింలు, ఎల్లయ్య, ప్రసన్నకుమార్ తదితరులు ఉన్నారు.



ఊర పండుగలోనూ నాయకుల ప్రచార జోరు

- పోటాపోటీగా ఫ్లెక్సీలు
- ప్రచారంలో బయటపడ్డ గ్రూపు రాజకీయాలు
- కాంగ్రెస్ నుంచి వెలిసిన కేశ వేణు, సంజయ్, మహేశ్‌కుమార్ గౌడ్ ఫ్లెక్సీలు
- పోలీసు బందోబస్తు మధ్య పండుగ ప్రశాంతం

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

నిజామాబాద్ జిల్లా కేంద్రంలో పోలీసుల భారీ బందోబస్తు మధ్య ఆదివారం ఊర పండుగ ప్రశాంతంగా ముగిసింది. సమస్యాత్మక ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. ఇక ఊర పండుగలోనూ రాజకీయ నాయకుల ప్రచార జోరు తగ్గలేదు. దేవతామూర్తుల ఊరేగింపు జరిగే దారుల్లో, ప్రధాన కూడళ్లలో రాజకీయ నాయకుల వందల ఫ్లెక్సీలు వెలిశాయి. ముఖ్యంగా కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు పోటాపోటీగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అసలే ఎన్నికల యేడాది కావడంతో రాజకీయ నాయకులు ఏ అవకాశాన్ని జార విడుచుకోవడం లేదు. ప్రతి అవకాశాన్ని తమకు అనుకూలంగా మలుచుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇక ఊరేగింపులోనూ అధికార పార్టీ ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్తాతో పాటు బీజేపీ నాయకులు యెండల లక్ష్మీనారాయణ, ధన్‌పాల్ ముందుండి నడిచారు. ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. కాంగ్రెస్ నుంచి బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్‌తో పాటు పలువురు నాయకులు ఊరేగింపులో భాగస్వామ్యం అయ్యారు. ఇక యాత్ర సాగే ఖిల్లా చౌరస్తా నుంచి గాజులపేట్, పెద్ద బజార్, ఆర్యసమాజ్ రోడ్డు, వినాయక్‌నగర్, దుబ్బ ప్రాంతాల్లో బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు వందల ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ముఖ్యంగా కాంగ్రెస్ నుంచి అర్బన్ టిక్కెట్టు ఆశిస్తున్న కేశ వేణుతో పాటు మాజీ మేయర్, కాంగ్రెస్‌లో చేరిన ధర్మపురి సంజయ్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్‌లు ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఇక బీజేపీ నుంచి ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా సైతం ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అధికార పార్టీ నుంచి ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్తా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ప్రతి అడుగుకూ ఒక ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఇంత పెద్ద మొత్తంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతో భక్తులు కూడా ఆశ్చర్యపోయారు.


బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ ఫ్లెక్సీల ఏర్పాటు


గ్రామదేవతల ఊరేగింపు

ఊర పండుగ ప్రశాంతం.... ఆలస్యంగా ఊరేగింపు ప్రారంభం

నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఆదివారం ఊర పండుగ ప్రశాంతంగా ముగిసింది. సర్వసమాజ్ కమిటీ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు మధ్య ఘనంగా నిర్వహించారు. డప్పు దరువులు, పోతరాజుల విన్యాసాలు, పులోరియా అంటూ అమ్మవార్లను పట్టణంలోని ప్రధాన వీధుల్లో ఊరేగించారు. శోభాయాత్ర ఖిల్లా(తేలు మైసమ్మ) గద్దె నుంచి ప్రారంభమయ్యింది. ఉదయం ప్రత్యేక పూజల అనంతరం వివిధ ప్రాంతాల్లో ఉన్న ఆలయాలకు అమ్మవార్లను ఊరేగింపుగా తీసుకెళ్లారు. తేలు మైసమ్మ ఆలయం వద్ద ఉదయం అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా, మహిళా ఛైర్‌పర్సన్ ఆకుల లలిత, నగర మేయర్ నీతూకిరణ్, మాజీ మేయర్ ఆకుల సుజాత, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ధన్‌పాల్ సూర్యనారాయణ పూజలు నిర్వహించారు. శోభాయాత్ర తేలు మైసమ్మ గద్దె నుంచి గాజులపేట్ చౌరస్తా మీదుగా పెద్దబజార్ చౌరస్తా వద్ద రెండు బృందాలుగా విడిపోయింది. ఒక బృందం దుబ్బ వైపు బయలుదేరింది. మరో బృందం సిర్నాపల్లి గడి పులాంగ్ మీదుగా వినాయక్‌నగర్‌లోని ఆలయాలకు వెళ్లింది. దేవతా మూర్తుల యాత్ర సమయంలో సరిని చల్లుతూ వెళ్లారు. దీన్ని దక్కించుకునేందుకు భక్తులు పోటీపడ్డారు.

ఆలస్యంగా ఊరేగింపు..

గత రెండు సంవత్సరాలుగా దేవతామూర్తుల ఊరేగింపు ఆలస్యమవుతుండటంతో భక్తులు కొంత అసహనం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఉదయం పది గంటల వరకు ఊరేగింపు సిర్నాపల్లి వరకు చేరుకునేది. కానీ గత రెండు సంవత్సరాలుగా మధ్యాహ్నం 12 నుంచి 1 అవుతోంది. దీంతో భక్తులు గంటలకొద్దీ నిరిక్షించి ఇండ్లకు తిరిగివెళ్లిపోయారు. ఆదివారం సైతం ఊరేగింపు ఆలస్యంగానే జరిగింది.

డిమాండ్లు పరిష్కరించకుండా జీపీ కార్మికులపై బెదిరింపులా..?

- ఒత్తిడి తెస్తే మరింత ఉధృతంగా ఆందోళనలు
- సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్

నవతెలంగాణ-రెంజల్


నినాదాలు చేస్తున్న కార్మికులు, సీఐటీయూ నాయకులు

పారిశుద్ధ కార్మికులు సమ్మెను విరంపచేయాలని ప్రభుత్వం ఒత్తిడి బెదిరింపులకు పాల్పడడం సరైనది కాదని సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ అన్నారు. సమస్యలు పరిష్కరించాల్సింది పోయి బెదిరింపులకు పాల్పడటం సరికాదని అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన రెంజల్ మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న సమ్మె 4వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికులు అధిక సంఖ్యలో దళితులు కావడం వల్లనే ప్రభుత్వం వివక్ష చూపుతోందని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కార్మికులకు గౌరవప్రదమైన వేతనాలను ప్రకటించాలని ఆమె డిమాండ్ చేశారు. కరోనా సమయంలో పారిశుధ్య కార్మికులు తమ ప్రాణాలను పణంగ పెట్టి గ్రామాల అభివృద్ధికి కృషి చేశారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మల్టీ పర్పస్ విధానాన్ని ప్రవేశపెట్టి ఒకే కార్మికుడికి అనేక రకాల పనులు అప్పగించి భారాన్ని మోపిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం జారీ చేసిన జీవోలను ఎందుకు అమలు చేయడం లేదని ఆమె ప్రశ్నించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఒక్కొక్క కార్మికుడికి 26వేల రూపాయల వేతనాలు ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి వాగ్దానం మేరకు పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. ప్రమాదవశత్తు కార్మికులు మృతిచెందితే పైసా రావడం లేదని, కార్మికులకు పిఎఫ్ ఈఎస్ఐ సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం బెదిరింపులకు భయపడేది లేదని సమస్యలు పరిష్కరించేంతవరకు సమ్మెను కొనసాగిస్తామని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఫసియుద్దీన్, ఉపాధ్యక్షులు బి సాయిలు, నాగమణి, లచ్చవ్వ, సాయమ్మ,, అక్తర్, తదితరులు పాల్గొన్నారు.

సఖీ సెంటర్‌కు బాల్యవివాహ బాధితురాలు

నవతెలంగాణ-నవీపేట్

మండలంలోని అబ్బాపూర్ తండాకు చెందిన బాల్య వివాహ బాధితురాలిని పోలీసులు గుర్తించి సఖీ కేంద్రానికి తరలించినట్టు నార్త్ రూరల్ సీఐ సతీష్ ఆదివారం తెలిపారు. 13 సంవత్సరాల బాలికను 42 ఏండ్ల వ్యక్తి సాహెబ్‌రావు బాల్య వివాహం చేసుకున్న ఘటన విధితమే. ఈ నేపథ్యంలో నిందితుడి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. అతడికి సహకరించిన వారిని అదుపులోకి తీసుకున్నట్లు ఆయన తెలిపారు.

పారిశుధ్య పనులను అడ్డుకున్న కార్మికులు


ప్రయివేటు సిబ్బందిని అడ్డుకుంటున్న జీపీ కార్మికులు

నవతెలంగాణ-నవీపేట్

మండల కేంద్రంలో మేకల సంత వ్యర్థాలను ప్రైవేట్ సిబ్బందితో అధికారులు తొలగించడానికి ప్రయత్నం చేస్తుండగా పంచాయతీ కార్మికులు ఆదివారం అడ్డుకున్నారు. ఈ సందర్భంగా సిబిటియు జిల్లా ఉపాధ్యక్షులు నాయక్ వాడి శ్రీనివాస్ మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా గ్రామంలో పారిశుద్ధ్య పనులను ప్రైవేటు సిబ్బందితో చేయించడాన్ని తీవ్రంగా ఖండించారు. తమ డిమాండ్లు పరిష్కరించే వరకు పారిశుద్ధ్య పనులు జరగకుండా అడ్డుకుంటామని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

అబ్బాపూర్‌తండాలో సీత్ల పండుగ


సీత్ల పండుగలో గిరిజనులు

నవతెలంగాణ-నవీపేట్

మండలంలోని అబ్బాపూర్(బి) తండాలో గిరిజన సీత్ల పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని గిరిజనులంతా కలిసి ఆరాధ్య దైవం సీత్ల దేవతకు ప్రకృతిలో ప్రత్యేక పూజలు చేసి కోళ్లు, మేకలను బలి చేసి వాటిపై నుండి పశువులను దాటించారు. తండాలో మహమ్మారి లాంటి వ్యాధులు ప్రబలకుండా ఉండడం, పశు సంపద పెరిగి క్రూర మృగాల నుండి కాపాడాలని శిథిలా తల్లికి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం బంధు సమేతంగా భోజనాలను ఆరగించి ఆటపాటలతో ఆహ్లాదంగా గడిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు శోభన్, రవి, కోలా పీర్ సింగ్, కైలాష్, సేవల్జీ, బాబు, మధుకర్, మహిళలు, యువకులు, పిల్లలు పాల్గొన్నారు.

వ్యాపారులకు అడ్డగా ఆరోగ్య ఉప కేంద్రం

నవతెలంగాణ-రెంజల్


ఆరోగ్య ఉప కేంద్రం ఎదుటే పశువులు, వాహనాలు

రెంజల్ మండలం సాటాపూర్ ఆరోగ్యం ఉపకేంద్రం శనివారం రోజున వ్యాపారుల వాహనాలను నిలుపుకోవడానికి అడ్డగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యాపారులు వాహనాలను నిలబడమే కాకుండా, పశువులను సైతం అక్కడే నిలిపి వేస్తుండడంతో ఆరోగ్య ఉప కేంద్రానికి వచ్చే పేషెంట్లకు నానా అవస్థలను ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. ప్రతి శనివారం జరిగే సాటాపూర్ సంత వ్యాపారులకు నిలుపుకోవడానికి స్థలం లేకపోవడంతో ఈ ఉపకేంద్రం ఆవరణలోనే నిలిపివేస్తుండడంతో వైద్య సిబ్బందితోపాటు ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. గ్రామ కార్యదర్శి ఈ విషయంపై తక్షణ చర్యలు తీసుకొని వ్యాపారస్తుల వాహనాలను వేరే చోట నిలిపేలా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

12న విద్యాసంస్థల బంద్

- పిలుపునిచ్చిన వామపక్ష విద్యార్థి సంఘాలు
- విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

నవతెలంగాణ-కామారెడ్డి(తాద్వాయి)/కంఠేశ్వర్


మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బోద అనిల్



కామారెడ్డిలోలో మాట్లాడుతున్న సురేశ్

విద్యారంగ సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ ఈ నెల 12న రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలు, ఇంటర్ కాలేజీల బంద్‌కు వామపక్ష విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చాయి. కామారెడ్డి జిల్లా కేంద్రంలో వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ బంద్‌లో విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయాలని వామపక్ష విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చాయి. ఈ సందర్భంగా పీడీఎస్‌యు రాష్ట్ర కోశాధికారి జి సురేష్, ఎస్ఎఫ్ ఐ జిల్లా అధ్యక్షుడు ముదాం అరుణ్ మాట్లాడారు. రాష్ట్రంలో కార్పోరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు ఫీజుల దందా కొనసాగిస్తున్నప్పటికీ ప్రభుత్వం వాటి నియంత్రణ కోసం ఎలాంటి చర్యలు తీసుకోలేదని అన్నారు. మంత్రుల ఉపసంఘం, తిరుపతిరావు కమిటీ రిపోర్ట్ బహిర్గతం చేయకపోవడం చూస్తే ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా వ్యవరిస్తు న్నట్టుగా ఉందని అన్నారు. విద్యాసంవత్సరం ప్రారం భమై నెల రోజులు గడుస్తున్నా యూనిఫామ్ ఇవ్వలేదని, కొన్ని పాఠ్యపుస్తకాలు పంపలేదని తెలిపారు. దీనికి తోడు సరిపడా ఉపాధ్యాయులు లేక చదువులు చెప్పే వారు కరువైయ్యారని, పారిశుద్ధ్య కార్మికులు లేరు, అనేక సమస్యలతో విద్యాసంవత్సరం ప్రారంభమైన నిర్దిష్టమైన చర్యలు ప్రభుత్వం తీసుకోవడం లేదని తెలిపారు. తాగునీరు, మధ్యాహ్న భోజనం బిల్లుల పెండింగ్, ముత్రశాలలు, సరైన మౌళిక సదుపాయాలు లేక ప్రభుత్వ విద్యారంగం గోల్లుమంటుందని అన్నారు. 'ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం హామీ అందని ద్రాక్షగా మారింది. ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఇంకా అందివ్వలేదు. లెక్చరర్స్ లేరు. ఎక్కడ సమస్యలు అక్కడే ఉన్నాయని అన్నారు.

'రాష్ట్రంలో గత నాలుగేళ్ల నుండి ఫీజు రీయంబర్స్ మెంట్స్ అండ్ స్కాలర్ షిప్స్ 5,177 కోట్లు పెండింగులో ఉన్నాయి. వాటిని కనీసం విడుదల చేయడం లేదు. గురుకులాలు, కెజిబివిలు, ఇంటర్ కళాశాలలుగా అప్ గ్రేడ్ చేసినా కేజీబీవీలు సొంత భవనాలు లేక అరకొర సౌకర్యాలతో అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. వాటికి నిధులు లేవు, లెక్చరర్స్, టీచర్స్ లేరు. నాణ్యమైన భోజనం లేక ఫుడ్ పాయిజన్స్ అవుతున్న ఘటనలు కో కొల్లలు గా ఉన్నాయి. రాష్ట్రంలో భారీ సంఖ్యలో టీచర్, లెక్చరర్స్ ఖాళీలు ఉన్నాయి. వాటి భర్తీ చేయడం లేదు. ఒక్క డిఎస్సీ ఇప్పటివరకు వేయలేదు. అందుకే ఈ సమస్యలను పరిష్కారం చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులను కదిలించి బంద్ నిర్వహి స్తున్నామని ప్రభుత్వం తక్షణమే స్పందించి సమస్య లు పరిష్కారం చేయాలని' డిమాండ్ చేశారు. అన్ని జిల్లాల్లో బంద్ విజయవంతం చేయాలని విద్యార్థి లోకానికి వామపక్ష విద్యార్థి సంఘాలు పిలుపు నిచ్చాయి. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్య క్షుడు అల్తాఫ్, పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి మోజీరామ్ , ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ శివ, ఏఐఎఫ్‌డీఎస్ జిల్లా అధ్యక్షుడు ఫయాజ్, పిడిఎస్‌యు జిల్లా ఉపాధ్యక్షులు సరి చంద్, జిల్లా కార్యదర్శి అనిల్, జిల్లా నాయకులు సచిన్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయండి : ఎస్ఎఫ్ఐ

కంఠేశ్వర్ : విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 12న తలపెట్టిన విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి బోద అనిల్ పిలుపునిచ్చారు. ఆదివారం ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, ఏఐఎస్‌బీఐ, ఏఐపిఎస్‌యు, ఏఐఎఫ్‌డిఎస్, పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్‌లో వాపక్ష విద్యార్థి సంఘాల ఐక్య విద్యార్థి సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రఘురాం, పిడిఎస్‌యూ జిల్లా కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్, పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి కర్కా గణేష్, ఏఐఎస్బి జిల్లా కన్వీనర్ గాజనంద్, ఏఐపిఎస్యు జిల్లా కార్యదర్శి జ్వాల, ఏఐఎండీఎస్ జాతీయ కన్వీనర్ మెత్రి రాజశేఖర్, ఏఐఎస్బి రాష్ట్ర ఉపధ్యక్షులు మహేష్ రెడ్డి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు విఘ్నేష్, పిడిఎస్యు జిల్లా అధ్యక్షులు గౌతమ్, పిడిఎస్యు జిల్లా అధ్యక్షులు నరేందర్, ఏఐపిఎస్యు రాష్ట్ర కార్యదర్శి కిరణ్,విద్యార్థి సంఘాల జిల్లా నాయకులు మహేష్, కుషాల్, మనోజ్, గోపాల్, లతీఫ్, సునిల్, సాయి, విలాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎంపీపీపై అవిశ్వాసానికి రంగం సిద్ధం

- నాగిరెడ్డిపేట్‌లో రాజకీయ పరిణామాలు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్(లింగంపేట్)



అసెంబ్లీ ఎన్నికలు సమీపి స్తున్న నేపథ్యంలో నాగిరెడ్డిపేట ఇన్చార్జ్ ఎంపీపీ రాజు దాసుపై అధికార పార్టీకి చెందిన ఎంపీ టీసీలు అవిశ్వాసానికి రంగం సిద్ధం అయ్యారు. దీంతో ఎల్లారెడ్డి నియోజకవర్గంలో ఒకేసారి రాజకీయాలు వేడెక్కా యి. తమదైన శైలిలో అధికార పార్టీకి చెందిన ఎంపీటీసీలు అవిశ్వాసానికి రంగం సిద్ధం చేసి ఎంపీపీ పదవిని చేపట్టడానికి కసరత్తు మొదలు పెట్టారు.

నాగిరెడ్డిపేట మండలంలోని తాండూరు గ్రామానికి చెందిన రాజు దాస్ తాండూర్ నుండి స్వతంత్ర ఎంపీటీసీ సభ్యునిగా గెలుపొందారు. తమదైన శైలిలో నాటకీయ పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఎంపీటీసీల సభ్యుల మద్దతుతో నాగిరెడ్డిపేట్ మండల పరిషత్ ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. నాగిరెడ్డిపేట ఎంపీపీ కాంగ్రెస్ పార్టీకి చెందిన కృష్ణవేణిపై ఎన్నికల పార్టీ విప్పును ధిక్కరించడంతో ఆమెపై వేటు పడింది. అప్పటినుంచి నేటి వరకు నాలుగు సంవత్సరాల పాటు వైస్ ఎంపీపీగా ఎన్నికైన రాజదాసు ఇన్చార్జ్ ఎంపీపీగా కొనసాగుతున్నారు. రాజు దాస్ తెలుగుదేశం పార్టీకి చెందిన సాను భూతిపరుడు. టిడిపి హయాంలో ఎమ్మెల్యే బి ఫాం చేతికి ఇచ్చిన అనంతరం తిరిగి బి ఫామ్ ను తీసుకున్నారు. ఈ నేపథంలో అధికార పార్టీ ఎంపీటీసీలు రహస్య ప్రదేశంలో సమావేశం ఏర్పాటు చేసుకొని మెజార్టీ ఎంపిటిసిల మద్దతుతో అవిశ్వాసానికి రంగం సిద్ధం చేశారు. గత రెండు రోజుల క్రితం ఎంపీటీసీలు ఎల్లారెడ్డి ఆర్డీవో శ్రీనివాస్ నాయక్ వినతి పత్రం అందజేశారు.

ఘనంగా బోనాల పండుగ

నవతెలంగాణ-సదాశివనగర్/జుక్కల్

కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం ఉత్నూర్ గ్రామంలో ఆదివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. బోనాలను అలంకరించి గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి బోనాలను గ్రామంలో ని ప్రధాన వీధుల గుండా డప్పు వాయిద్యాలతో బంగారు మైషమ్మ దేవాలయం వరకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. బంగారు మైషమ్మ కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి సంవత్సరం ఆషాఢ మాసంలో పంటలు మంచిగా పండాలని ఈ పండగ నిర్వహిస్తామని గ్రామస్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మోతె సాయవ్వ, గ్రామ అభివృద్ధి సంఘం అధ్యక్షుడు దొడ్లే రవీందర్‌రావు, ఎంపిటిసి చందర్ రావు, వార్డు మెంబర్‌లు, వీడీసీ సభ్యులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.


సదాశివనగర్‌లో బోనాల ఊరేగింపు

జుక్కల్ : జుక్కల్ మండలంలోని గౌడ కులస్తుల ఆధ్వర్యంలో బోనాల పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని గౌడ కులస్తుల ప్రతి గడప నుండి బోనాలను మహిళలు ఎత్తుకుని భక్తిశ్రద్ధలతో బాజా భజంత్రీలతో వందలాదిగా మహిళలు బోనాలను ఎత్తుకుని ఊరేగింపుగా తీసుకెళ్లి గ్రామదేవతలకు సమర్పించారు. ఈ ఏడు రైతులకు పంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షించారు.

డిమాండ్స్ డే ను విజయవంతం చేయండి

- సీఐటీయూ జిల్లా నాయకులు సురేష్ గొండ

నవతెలంగాణ-జుక్కల్

డిమాండ్స్ డే ను విజయవంతం చేయాలని సీఐటీయూ జుక్కల్ నియోజకవర్గ కన్వీనర్, జిల్లా నాయకులు సురేశ్‌గొండ అంగన్‌వాడీలకు పిలుపునిచ్చారు. ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. నేడు (సోమవారం) కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలాయాల వద్ద అంగన్‌వాడీ టీచర్ల సమస్యల పైన నల్ల చీరలు కట్టుకుని నిరసన తెలపనున్నట్టు వెల్లడించారు. నూతన జాతీయ విద్యావిదానాన్ని రద్దు చేయాలని , ఐసిడిఎస్‌కు నిధులు పెంచాలని కోరుతు డిమాండ్స్ డేను నిర్వ హిస్తున్నామని తెలిపారు. అంగన్‌వాడీలందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

బహిరంగ చర్చకు రండి

• బీఆర్ఎస్ సోషల్ మీడియా పార్టీ ఇంచార్జ్ గడ్డం చిన్నారెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్

కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి జరిగింది అని చెప్పే నాయకులు బహిరంగ చర్చకు రావాలని బి.ఆర్.ఎస్ సోషల్ మీడియా ఇంచార్జ్ గడ్డం చిన్నారెడ్డి సవాలు విసిరారు. ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ నాయకుల చేసిన అభివృద్ధి ఎలా ఉంది అంటే.. కరెంటు స్తంభాలు వేస్తే.. కరెంటు ఇవ్వడం మర్చిపోయారని, లిఫ్టులు కట్టించారని, కానీ వాటికీ నీళ్లు అందించడం మర్చిపోయారని విమర్శించారు. కాంగ్రెస్ నాయకులు చేసిన అభివృద్ధి వాళ్ల కమీషన్ కోసం మాత్రమే చేశారని తెలిపారు. కానీ బీఆర్ఎస్ పార్టీ ప్రజలకు ఫలాలు అందిస్తుందని తెలిపారు.

రాష్ట్ర ప్రజలకు బోనాల పండుగ శుభాకాంక్షలు

• మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

నవతెలంగాణ-వేల్పూర్

రాష్ట్ర ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఆనందంగా ఉండాలని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. ప్రజలందరికీ శ్రీ ఉజ్జయిని మహంకాళి బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఉజ్జయిని మహంకాళి ఆశీస్సులు తెలంగాణ రాష్ట్ర ప్రజలపై ఉన్నాయని, సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో ముందజలో దూసుకోపోతుందని పేర్కొన్నారు. ముఖ్యంగా తెలంగాణా రాష్ట్ర వ్యవసాయంలో దేశంలోనే మొదటి స్థానంలో ఉందని వేముల ప్రశాంత్‌రెడ్డి తెలిపారు.

సొంత భవనంలో

'ఈశ్వర్ గ్యాస్ట్రో, లివర్' ఆస్పత్రి..

• ప్రారంభించిన ఎమ్మెల్యే బిగాల

• ఎండోస్కోపీ, కొలనోస్కోపీ, పీఈజీ, ఐసీయూ సౌకర్యాలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఖలీల్‌వాడీలోని అపూర్వ స్కూల్ వద్ద నూతనంగా నిర్మించిన ఈశ్వర్ గ్యాస్ట్రో, లివర్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా, నగర మేయర్ దండు నీతు కిరణ్ ఆదివారం ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్యాస్ట్రిక్, లివర్‌తో వచ్చే వ్యాధి సమస్యలను సూపర్ స్పెషాలిటీ వైద్యం అందించి వ్యాధులను నిరోధించుటకు జిల్లా ప్రజలకు అందుబాటులో ఉంచడం, తద్వారా ఎంతటి గ్యాస్ట్రిక్, లివర్ సమస్యలనైనా ఈ ఆసుపత్రిలోనే వైద్యం అందించే విధంగా ఆసుపత్రిని నూతన హంగులతో పరికరాలతో అన్ని సౌకర్యాలతో, అన్ని రకాల వసతులతో ఆసుపత్రి ఏర్పాటు చేయడాన్ని శుభసూచికమని అన్నారు. అనంతరం డాక్టర్ ఈశ్వర్ చేగంటి మాట్లాడుతూ.. ప్రస్తుతం తీసుకునే ఆహారం, నీరుతో ఎన్నో అనారోగ్య సమస్యలు వాటిల్లడంతో పాటు లివర్ పాడైపోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయని అందుకే లివర్ పాడైపోకుండా ఉండేందుకు సరైన, సక్రమమైన వైద్యం అందించడానికి, జిల్లా ప్రజలకు ఎండోస్కోపీ, కొలనోస్కోపీ, పీఈజీ, ఐసీయూలు అనువుగా ఉండేవిధంగా, ఎల్లప్పుడూ సేవలు అందించే విధంగా ఉండడానికై సొంత భవనం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి యాజమాన్యం డాక్టర్ రాజేశ్వరి చేగంటి, ఆసుపత్రి మేనేజ్‌మెంట్ శ్రీనివాస్, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విధానాలతో విద్యారంగం నిర్వీర్యం

• డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శంతన్



మాట్లాడుతున్న శంతన్

నవతెలంగాణ-కంఠేశ్వర్

ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల విద్యారంగం నిర్వీర్యం అవుతుందని, గత తొమ్మిదేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విద్యారంగ వ్యతిరేక విధానాల వల్ల విద్యావ్యవస్థ నిర్వీర్యం అయిందని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శంతన్ ఆరోపించారు. ఆదివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు ఎం.బాలయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శంతన్ మాట్లాడుతూ.. విద్యారంగ నాణ్యత విషయంలో 36 రాష్ట్రాలు కేంద్రపాలిత ప్రాంతాలలో కేంద్ర ప్రభుత్వం 2021-2022 సంవత్సరంలో ఆరు ప్రమాణికాల ఆధారంగా నిర్వహించిన సర్వేలో అట్టడుగున 31వ స్థానంలో తెలంగాణ రాష్ట్రం నిలిచిందని, పక్క రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ మనకంటే మెరుగైన విద్యను అందిస్తోందని ఆ రాష్ట్రానికి 16వ స్థానం తగ్గిందని, దేశంలోనే అత్యంత ధనిక రాష్ట్రమని చెప్పుకునే తెలంగాణలో విద్యారంగం ఎందుకు వెనుకబాటుకు గురైందో దీనికి ప్రభుత్వం సమాధానం చెప్పాలని శంతన్ డిమాండ్ చేశారు. పాఠశాల విద్యతో పాటు యూనివర్సిటీ స్థాయి విద్య వరకు విద్యారంగం తీవ్ర సంక్షోభంలో ఉందని తెలంగాణ ఏర్పాటు నుంచి పదవి విరమణ పొందినవారి స్థానంలో నియామకాలు చేపట్టకపోవడం కారణంగా యూనివర్సిటీలలో సైతం బోధనకు తీవ్ర ఆటంకం కలుగుతోందని అన్నారు. తొమ్మిదేళ్లుగా విద్యారంగ పటిష్టతకు ఉపాధ్యాయ సంఘాలతో గాని విద్యారంగ నిపుణులతోగాని సమావేశాలు ఏర్పాటు చేసి చర్చించకపోవడం పటిష్టతకు చర్యలు తీసుకోకపోవడమే ఇందుకు కారణమని అన్నారు. జిల్లా అధ్యక్షుడు యం.బాలయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజన్న, జిల్లా కమిటీ సభ్యులు రాందాస్, అరుణ్ కుమార్, ఒమజి పాల్గొన్నారు.

కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలి

• టీపీసీసీ అధికార ప్రతినిధి బాస వేణుగోపాల్ యాదవ్



వేణుగోపాల్‌యాదవ్, రవికి సన్మానం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

బాల్కొండ నియోజకవర్గంలో 2024లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరబోతుందని దానికోసం కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని టీపీసీసీ అధికార ప్రతినిధి బాస వేణుగోపాల్ యాదవ్ అన్నారు. ఆదివారం మండలంలోని ఉప్లూర్‌లో టీపీసీసీ అధికార ప్రతినిధిగా నియామకమైన బాస వేణుగోపాల్ యాదవ్, రెండవసారి మండల అధ్యక్షుడిగా నియామకమైన సుంకెట రవిలను కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ యాదవ్ మాట్లాడుతూ మండలంతో పాటు బాల్కొండ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని పటిష్టం చేయడానికి తమ వంతుగా కృషి చేస్తామన్నారు. కష్టకాలంలో పార్టీ వెంట ఉన్న కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామన్నారు. బీఆర్ఎస్ పార్టీ అనుసరిస్తున్న దోపిడీ, అవినీతికి, ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయవలసిన అవసరం ఉందన్నారు. బీఆర్ఎస్, బీజేపీలు ఒకటేనని, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ని తొలగించి కిషన్‌రెడ్డిని నియమించినప్పుడే తెలంగాణ ప్రజలకు వాళ్ల అంతర్గత మిత్రులని తెలిసిపోయిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు కొమ్ముల రవీందర్, కాంగ్రెస్ కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పిరెడ్డి శ్రీనివాస్, కార్యదర్శి తక్కూరి దేవేందర్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బోనగిరి భాస్కర్, నాయకులు బద్దం రాజేశ్వర్‌రెడ్డి, ఏలేటి మోహన్‌రెడ్డి, శేఖర్, తిరుమలేష్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా..

ఊర పండుగ..



ఊరేగింపులో పోతరాజులు



దేవత ఊరేగింపు

• ఆకట్టుకున్న పోతరాజుల విన్యాసాలు

• పెద్దఎత్తున పాల్గొన్న ప్రజలు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ నగరంలో ఊర పండుగ ఉత్సాహంగా కొనసాగింది. ఆదివారం ఉదయం సర్వ సమాజ్ ఆధ్వర్యంలో సార్గమ్మలు, కొండల రాయుడు, దొరసాని (భోగం సాని) ప్రతిమలను సిర్నాపల్లి గడి ప్రాంతంలో ప్రతిష్టించారు. అనంతరం.. నగరంలోని ఖిల్లా ప్రాంతంలోని తేలు మైసమ్మ గద్దె వద్ద మరికొన్ని దేవతల విగ్రహాలకు సాంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడి నుంచి ఊరేగింపు చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా, మేయర్ దండు నీతు కిరణ్, సర్వ సమాజ్ కమిటీ సభ్యులు, అన్ని కుల సంఘాల పెద్దలు హాజరై ఊరేగింపులో పాల్గొన్నారు. గ్రామ దేవతల ప్రతిమలను డప్పు సప్పుళ్ల, పోతురాజులు, శివసత్తులు విన్యాసాలతో ఊరేగింపు ప్రారంభించారు. ఊరేగింపు ఖిల్లా రోడ్డు నుంచి గాజులపేట్, పెద్ద బజార్ రోడ్డు, కసాబ్‌గల్లీ మీదుగా సాగింది. అడెల్లి పోచమ్మ, పగడాలమ్మ, పెద్దమ్మ తల్లి ప్రతిమలను దుబ్బా ప్రాంతం వైపు ఊరేగింపు చేపట్టారు. అలాగే మహాలక్ష్మి, ఐదు చేతుల పోచమ్మ మత్తడి పోచమ్మ, రాట్నంల ప్రతిమలను వినాయక్‌నగర్ వైపు ఊరేగింపు సాగింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఊరేగింపులో ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు. పోతరాజులతో సెల్ఫీలు దిగేందుకు యువతీయువకులు పోటీపడ్డారు.



నకాశ్ యువజన సంఘం ఆధ్వర్యంలో తాగునీరు పంపిణీ



పోలీసు బందోబస్తు



పోతరాజుతో సెల్ఫీకి పోటీపడుతున్న యువతీయువకులు

పోడు భూములకు పట్టాలివ్వాలి

• రూరల్ ఎమ్మెల్యేను కలిసిన మంచిప్ప గ్రామస్తులు

నవతెలంగాణ-మోపాల్



ఎమ్మెల్యే వద్ద బాధితులు

పోడు భూములకు పట్టాలివ్వాలని మండలంలోని మంచిప్ప గ్రామ తండా వాసులు రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ను ఆదివారం కలిశారు. 50 సంవత్సరాల నుండి గ్రామానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న రాజుల గట్ట అటవీ భూమిని సాగు చేసుకుని జీవనోపాధి పొందుతున్నామని, కొన్ని సంవత్సరాల నుంచి అటవీ అధికారులు కేసులు పెడతామని భయభ్రాంతులకు గురిచేశారని అన్నారు. వారికి భయపడి సాగును ఆపామని, దానివల్ల తమకు పోషణ కష్టమై అడ్డా కూలీలుగా మారామని అన్నారు. తమ కష్టాన్ని అర్థం చేసుకొని పోడు భూమి పట్టాలని అందజేయాలని, దానివల్ల 130 గిరిజన కుటుంబాలను ఆదుకున్న వారవుతారని తెలిపారు. దానికి ఎమ్మెల్యే స్పందించి ఉన్నతాధికారులతో, ముఖ్యమంత్రితో మాట్లాడి న్యాయం జరిగే విధంగా చూస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రామస్తులు సర్పంచ్ ఇంధురి సిద్ధార్థకు, రూరల్ ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో కోఆప్షన్ అజీమ్, గిరిజన సోదరులు తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ సబ్ సెంటర్లకు రూ.20 లక్షల చొప్పున నిధుల మంజూరు..

నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో 20 హెల్త్ సబ్ సెంటర్లకు రూ.4కోట్ల నిధులు మంజూరు అయ్యాయి. రూరల్ నియోజకవర్గంలో వివిధ మండలాల్లో పక్కాభవనాలు కలిగిన హెల్త్ సబ్ సెంటర్లకు ఇక మహర్దశ పట్టనుంది.

రూరల్‌లోని 20 ఆరోగ్య ఉప కేంద్రాల మరమ్మతు, పునరుద్ధరణ కోసం సర్కారు నిధులు మంజూరు చేసిందని, ప్రతీ సబ్ సెంటర్‌కు రూ.20 లక్షల చొప్పున మొత్తం రూ.4 కోట్ల నిధులను కేటాయిస్తూ వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేసినట్లు రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ తెలిపారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన వెల్లడించా రు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రూర ల్ నియోజకవర్గంలో 20 సబ్ సెంటర్లు ఉండగా వాటిలో 20 ఈ భవనాల్లో తాగునీటి సౌకర్యం, కరెంటు, డ్రైనేజీ, మూత్రశాలలు, ప్రహరీ నిర్మాణం, వ్యర్థాల నిర్వహణ, పేయింటింగ్, రోగులు కూర్చునేందుకు కుర్చీలు, రిజిస్టర్ల నిర్వహణ తదితర పనులకు నిధులను వెచ్చించనున్నారు. త్వరలోనే ఈ పనులను చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఇందల్‌వాయి ప్రభుత్వ ఆసుపత్రి పరిధిలోని డిచ్‌పల్లి మండలానికి 7 హెల్త్ సబ్ సెంటర్లు గ్రామాలు బర్ధిపూర్, డిచ్‌పల్లి, ఘన్‌పూర్, నడిపల్లి, రాంపూర్.డి, ధర్మారం.బి, సుద్దపల్లి, ఇందల్‌వాయి మండలంలోని చంద్రాయన్‌పల్లి గ్రామానికి ఒక సబ్ సెంటర్ మంజూరు చేసినట్టు ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ వివరించారు.

దళితులపై వివక్ష

• కేవీపీఎస్

నవతెలంగాణ-కంఠేశ్వర్

దళితులపై సామాజిక వివక్ష పాటించి సహకరించిన వారిని అరెస్టు చేయాలని కేవీపీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నరసయ్య, ఉపాధ్యక్షుడు కొండ గంగాధర్ మాట్లాడుతూ.. సిద్దిపేట జిల్లా జగదేవ్ మండలం తిమ్మాపూర్ గ్రామంలో దళితులకు క్షౌరషాపులో క్షవరం చేయకుండా సామాజిక కుల వివక్షకు ప్రోత్సహించిన నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. తిమ్మాపూర్ గ్రామంలో సామాజిక వివక్ష కొనసాగుతుందని, షోరూం షాపులో దళితులకు క్షవరం చేయించకుండా గ్రామాల్లో ఆధిపత్య కులాలను తీర్మానం చేసి అవమాన పరుస్తున్నారని తెలిపారు. సంబంధిత అధికారులు గ్రామాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి మనుషులంతా సమానమేనని చెప్పాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు నల్గొండ నరసయ్య, రాజేష్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

నవతెలంగాణ-కంఠేశ్వర్

క్రీడలతో మానసికోల్లాసంతో పాటు శారీరక దృఢత్వం కలిగి ఉంటుందని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా అన్నారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో తెలంగాణ రాష్ట్ర తొమ్మిదవ సబ్ జూనియర్ డిస్టిక్ ఫుట్‌బాల్ ఛాంపియన్షిప్‌ను ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో నగర మేయర్ దండు నీతూ కిరణ్, జడ్పీ చైర్మన్ విఠల్ రావు, తెలంగాణ ఫుట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ పాల్గుణ, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఈగ సంజీవ్‌రెడ్డి, నరాల సుధాకర్, జావీద్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో బోనాలు

• గ్రామ దేవతలకు జలాభిషేకం

• వనభోజనాలకు వెళ్లిన ప్రజలు

నవతెలంగాణ-విలేకరుల బృందం

ఉమ్మడి జిల్లాలోని పలు గ్రామాల్లో ఆదివారం బోనాల పండుగ నిర్వహించారు. అలాగే గ్రామ దేవతలకు జలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వనభోజనాలకు వెళ్లి.. కుటుంబ సభ్యులు, బంధువులతో ఉత్సాహంగా గడిపారు.

బోధన్ : సాలూర మండల కేంద్రంలో మహాలక్ష్మి, పోచమ్మ దేవతల పండగను గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 3 రోజులుగా గ్రామంలో పండగ క్రతువు నిర్వహించారు. శనివారం రాత్రి ప్రారంభమైన పండగ వేడుకలు 21 గ్రామ దేవతల కలప విగ్రహాలను ప్రతిష్టాపన వేకువ జామున వరకు కొనసాగాయి. పోతరాజుల విన్యాసాలు అలరించాయి. చివరి ఆదివారం నాడు జోగిణి మహిళ రంగం కార్యక్రమం నిర్వహించి పండగ వేడుకలు ముగించారు. పండగ సందర్భంగా వివిధ గ్రామాల నుంచి జనం భారీగా తరలిరావడంతో గ్రామం సందడిగా మారింది. కార్యక్రమంలో గ్రామ పోలీస్ పటేల్ వెంకట్ పటేల్, గ్రామ పెద్దలు బుద్దె రాజేశ్వర్, ఇల్తెపు శంకర్, అల్లె జనార్దన్, సురేష్ పటేల్, వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పూసల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా బోనాలు..

బోధన్ పట్టణంలో పూసల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా బోనాల పండగను నిర్వహించారు. పట్టణంలోని బీటి నగర్ కోట మైసమ్మ మందిరం నుండి పోలీస్ స్టేషన్ ఎదురుగా మహాలక్ష్మి మందిరం వరకు మహిళలు బోనాలు ఎత్తుకొని, మంగళ హారతులతో మహాలక్ష్మి ఆలయానికి చేరుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పడి పాడిపంటలు పశు సంపద సర్వజనులు సుఖ సంతోషాలతో ఉండాలని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బోధన్ పట్టణ పూసల సంఘం అధ్యక్షుడు పసులోటి గోపి కిషన్, కోనేటి కృష్ణ, పరమేష్, కోనేటి రాజు, హరి, శంకర్, కిషోర్, నరేష్, దుర్గేష్ కుల సభ్యులు మహిళలు పాల్గొన్నారు.



బోధన్ : కల్దుర్కిలో బోనాల ఊరేగింపు..



డిచ్‌పల్లిలో..

కల్దుర్కిలో బోనాల సందడి..

కల్దుర్కి గ్రామంలో బోనాల పండగను గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలు ఎత్తుకొని డప్పుచప్పుళ్లతో గ్రామ దేవతల వద్దకు చేరుకున్నారు. అనంతరం దేవతల ప్రత్యేక పూజలు నిర్వహించి వర్షాలు సమృద్ధిగా కురవాలని, పాడి పంటలు పుష్కలంగా పండాలని మొక్కులు తీర్చుకున్నారు. బోనాల పండగతో గ్రామం సందడిగా మారింది. కార్యక్రమంలో సర్పంచ్ నానాపటేల్, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

పడగల్‌లో వన భోజనాలు..

వేల్పూర్ : మండలంలోని పడగల్ గ్రామంలో ఘనంగా వనభోజనాలు నిర్వహించారు. గ్రామంలో గ్రామదేవత పోచమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామస్తులందరూ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి వనభోజనానికి వెళ్లారు. ఆషాడ మాసం రెండో ఆదివారం సందర్భంగా వన భోజనాలకు వెళ్లి ఉత్సాహంగా గడిపారు. మండలంలోని రామన్నపేట్, తదితర గ్రామాలలో ఘనంగా వనభోజనాలు నిర్వహించారు. గ్రామదేవత పోచమ్మలకు ప్రత్యేక పూజలు చేశారు.

ఘనంగా ఊర పండగ..

డిచ్‌పల్లి : డిచ్‌పల్లి, ఇందల్‌వాయి మండల కేంద్రాలతో పాటు ఆయా గ్రామాలలో ఘనంగా పోచమ్మ పండగ, ఊరు పండగను ఘనంగా నిర్వహించారు. గత 70 ఏళ్ల నుంచి ధర్మారం గ్రామ ప్రజలు ఘనంగా పోచమ్మ పండగను నిర్వహిస్తున్నామని, ఆషాడ మాసం మొదటి ఆదివారం మొదలుకొని చివరి ఆదివారం మహాలక్ష్మి ఆలయం నుంచి పోచమ్మ ఆలయం వద్దకు ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించి అమ్మవారికి పసుపు కుంకుమలతో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని రావుల బ్రహ్మయ్య, నాయుడు ఆంజనేయులు, నాగార్జున, మధు, సురేష్, గోపితో పాటు ఆయా గ్రామాల అభివృద్ధి కమిటీలు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బట్టాపూర్‌లో బోనాలు..

ఏర్గట్ల : మండలంలోని బట్టాపూర్ గ్రామంలో గ్రామకమిటీ ఆధ్వర్యంలో ముత్యాల పోచమ్మ, ఐదు చేతుల పోచమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. అమ్మవార్లకు నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామకమిటీ అధ్యక్షులు బత్తుల సంజీవ్, సర్పంచ్ కట్కం పద్మాసాగర్ మాట్లాడుతూ.. గ్రామంలో నూతన ఆలయాల నిర్మాణం, ఊరి దేవతల విగ్రహ ప్రతిష్టాపన చేపట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ చిల్క భగీరథ కిషన్, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

ఎడపల్లి : మండలంలోని మంగళ్‌పహాడ్, ఎడపల్లి, కుర్నాపల్లి, జమలం, తానాకలాన్, ఆయా గ్రామాలలో గ్రామస్తులు వనభోజనాలకు వెళ్లారు. గ్రామ శివారులోని గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాలను సమర్పించారు.



ఏర్గట్ల : బట్టాపూర్‌లో..

ఘనంగా మహంకాళి బోనాల పండగ

నవతెలంగాణ-దోమకొండ

దోమకొండ మండల కేంద్రంలోని చాముండేశ్వరి ఆలయంలో ఆదివారం మహంకాళి అమ్మవారి బోనాల పండగ సందర్భంగా మహిళలు బోనాలు సమర్పించి ప్రతేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఆలయం వద్ద పోతురాజులు విన్యాసాలు, గౌప్ పట్టి, రంగం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి తీగల తిరుమల గౌడ్, సిడిసి చైర్మన్ ఐరేణి నరసయ్య, గంద్ర మధుసూదన్ రావు, ఎంపీపీ కానుగంటి శారద నాగరాజు, సర్పంచ్ నల్లపు అంజలి శ్రీనివాస్,ఆలయ కమిటీ చైర్మన్ పాలకుర్తి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.


బోనాలతో తరలివచ్చిన భక్తులు

కాంగ్రెస్ మండల అధ్యక్షునిగా గంగారం పటేల్

నవతెలంగాణ-మద్నూర్

నూతనంగా ఏర్పడిన డోంగ్లి మండలానికి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా పార్టీ సీనియర్ నాయకులు సిర్పూర్ గంగారం పటేల్ ఎన్నికయ్యారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్ గంగారం పటేల్‌ను డోంగ్లి మండల పార్టీ అధ్యక్షునిగా నియమిస్తూ నియామకపత్రం అందజేశారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు.


గంగారం పటేల్

అటు బోధన.. ఇటు బాధ్యతలు..

- బోధించే అధ్యాపకులకే ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులుగా బాధ్యతలు
- భారమవుతున్న ఇంఛార్జ్ బాధ్యతలు
- రెగ్యులర్ ప్రధానోపాధ్యాయుల సమస్య తీరేనా..?
- ప్రమోషన్ల కోసం ఎదురుచూపులు



నవతెలంగాణ-భిక్కనూర్

అసలే సమస్యల వలయంలో ప్రభుత్వ పాఠశాలలు కొట్టుమిట్టాడుతుంటే దీనికి తోడు పాఠశాలలో సరిపడా ఉపాధ్యాయులు లేక ఇటు ఉపాధ్యాయులు అటు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాలల్లో ప్రధానోపా ధ్యాయులు లేక ప్రధానోపాధ్యాయుల బాధ్యతలను, ఇటు విద్యార్థులకు విద్యా బోధన, ఇతర సమస్యలపై వచ్చిన విద్యార్థులకు సమాధానం చెప్పడం, మధ్యాహ్న భోజన నిర్వహణ చూసుకోవడం అన్ని విధులు విద్యార్థులకు భోదించె ఉపాధ్యాయులు ఏ విధంగా నిర్వహించాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు.

రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2015వ సంవత్సరంలో మాత్రమే విద్యా శాఖలో పదోన్నతులు కల్పించారు. అప్పటినుండి నేటి వరకు ఎనిమిది సంవత్సరాలు గడుస్తున్నా ఉపాధ్యాయులకు పదోన్నతులు, ప్రమోషన్లు లేక సతమతమవుతున్నారు. పదోన్నతి విషయం కోర్టులో పెండింగ్లో ఉన్న కారణంగా ఎప్పుడు ప్రమోషన్లు వస్తాయో, కోర్టు కేసు ఎప్పుడు తేలుతుందో అని ఉపాధ్యాయులు ఎదురుచూస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యా బోధన, ఉన్నత చదువులు చదివిన ఉపాధ్యాయులు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, దుస్తులు, పుస్తకాలు, ఆడుకోవడానికి మైదానం సౌకర్యాలు ఉంటాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఎంతో ఆశతో పంపిస్తే అన్నీ ఉన్నా కానీ సరిపడా ఉపాధ్యాయులు లేక నాణ్యమైన విద్యా బోధన విద్యార్థులకు అందడం లేదు అన్నా విమర్శలు వినిపిస్తున్నాయి. రెగ్యులర్ ప్రధానోపాధ్యాయులు లేక పాఠశాల కార్య నిర్వహణ మొత్తం బోధన అధ్యాపకుల పై పడుతుంది. సమయం దొరికినపుడు విద్యార్థులకు బోధించి ప్రధానోపాధ్యాయుల విధులు నిర్వహిస్తున్నారు.

కామారెడ్డి జిల్లాలో 697 ప్రాథమిక పాఠశాలలు, 129 ప్రాథమికోన్నత పాఠశాలలో, 187 పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్నాయి. జిలా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో 99,862 మందికి పైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ప్రాథమిక పాఠశాలలో ఎవరైతే సీనియర్ ఉపాధ్యాయులు ఉంటారో వారే ప్రధానోపాధ్యాయుల బాధ్యత నిర్వహించాలి. 100 మందికి పైగా విద్యార్థులు ఉంటే మాత్రం ఒక ఉపాధ్యాయుడికి ప్రమోషన్‌పై ఉపాధ్యాయుల బాధ్యతలను అప్పగించాలి. ప్రాథమికోన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులే ప్రధానోపాధ్యాయుల బాధ్యత నిర్వహిస్తున్నారు. జిల్లా పరిషత్ హైస్కూల్లో పూర్తిస్థాయిలో రెగ్యులర్ ప్రధానోపాధ్యాయులను నియమించాల్సింది. కానీ 187 పాఠశాలలో 113 మంది ఇన్చార్జి ప్రధానోపాధ్యాయుల బాధ్యత నిర్వహిస్తున్నారు. దీంతో విద్యను బోధించే ఉపాధ్యాయులకు ప్రధానోపాధ్యాయుల బాధ్యతలు అదనంగా భారం అవుతున్నాయి.

ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు స్పందించి ప్రతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెగ్యులర్ ప్రధానోపాధ్యాయులను నియమించాలని, గాడి తప్పుతున్న విద్యావ్యవస్థను సరైన పద్ధతిలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే విధంగా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుకుంటున్నారు.

రెగ్యులర్ హెచ్ఎంలను నియమిస్తే పని భారం తగ్గుతుంది

పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు దామోదర్ రెడ్డి



సీనియర్ ఉపాధ్యాయులకు ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు బాధ్యతలు అప్పగించడం కారణంగా పని భారం పెరిగి విద్యార్థులకు విద్యను బోధించే సమయం లేకుండా పోతుంది. పదోన్నతుల ప్రక్రియ కోర్టు కేసులో ఉన్న కారణంగా రెగ్యులర్ ప్రధానోపాధ్యాయుల ఏర్పాటు పెండింగ్లో ఉందన్నారు. ప్రభుత్వం స్పందించి త్వరలోనే రెగ్యులర్ ప్రధానోపాధ్యాయులను ప్రమోషన్‌లపై నియమించారు.

రెగ్యూలర్ హెచ్ఎంలను నియమించాలి

టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి రాజేష్



ప్రభుత్వ పాఠశాలలో సరిపడా ఉపాధ్యాయులు లేక ఉన్న ఉపాధ్యాయులలో సీనియర్ ఉపాధ్యాయులకు ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయ బాధ్యతలను అప్పగించడంతో పని ఒత్తిడితో సతమతమవుతున్నారు. విద్యను బోధించే సమయం ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులకు లేకపోతుంది. వెంటనే రెగ్యులర్ ప్రధానోపాధ్యాయులు నియమిస్తేనే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే అవకాశం ఉంది.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు పంపిణీ


చెక్కును అందజేస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్, సర్పంచ్

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండలంలోని ఒంటరిపల్లి గ్రామానికి చెందిన పలువురి లబ్దిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన చెక్కులను పంపిణీ చేసినట్టు ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఒంటరి సిద్ధారెడ్డి తెలిపారు. ఆయన చేతుల మీదుగా లబ్దిదారులకు ఆదివారం అందజేశారు. గ్రామానికి చెందిన రాపర్తి రాములుకు రూ.60 వేలు, రాపర్తి రవితేజకు రూ60 వేల రూపాయల చెక్కులను అందజేశారు. ఇరువురూ అనారోగ్యానికి గురి కావడంతో ప్రైవేట్ ఆస్పత్రి పాలయ్యారు. నిరుపేద కుటుంబం కావడంతో ముఖ్యమంత్రి సహాయ నిధి కోసం అర్జీ చేసుకున్నారని తెలిపారు. లబ్దిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాజయ్య, బిఆర్ఎస్ నాయకులు రాజిరెడ్డి, అశోక్, కిషన్ నాయక్, సాయిలు, తేజ, తదితరులు పాల్గొన్నారు.

మున్నూరు కాపు జిల్లా కేంద్ర భవన నిర్మాణానికి రూ.16 వేల విరాళం అందజేత


విరాళం అందజేత

నవతెలంగాణ-మద్నూర్

మున్నూరు కాపు సంఘం కామారెడ్డి జిల్లా కేంద్రంలో నూతన భవన నిర్మాణానికి మద్నూర్ మండల మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు సారంగుల వార్ గంగారం ఆదివారం నాడు మద్నూర్ మండల కేంద్రంలో మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షులు మామిళ్ళ అంజయ్యకు విరాళంగా 16 వేల రూపాయలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మామిళ్ళ అంజయ్య మాట్లాడుతూ 16 వేల రూపాయలు విరాళంగా అందజేసిన ఎస్ గంగారామ్‌కు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. జిల్లా కేంద్రంలో మున్నూరు కాపు సంఘం భవనం నిర్మిస్తే జిల్లా కేంద్రానికి వచ్చే మున్నూరు కాపులకు సౌకర్యంగా ఉంటుందని తెలిపారు. సంఘ భవన నిర్మాణానికి విరాళాలు అందించడానికి ముందుకు రావాలని ఆయన కోరారు.

జనమంతా వన భోజనానికి...


గాంధారిలో వన భోజనలు చేస్తున్న గ్రామస్తులు

నవతెలంగాణ-గాంధారి/సదాశివనగర్/లింగంపేట్

గాంధారి మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం వన భోజనాల సందడి నెలకొంది. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఆషాడ మాసంలో వన బోజనాలను వెళ్లడం ఆనవాయితీగా వస్తోంది. గ్రామ దేవతలకు ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాలు బాగాకురిసి మంచిగా పాడిపంటలు పండలని పిల్లపాపలు పశుపక్షాదులు సల్లగా ఉండాలని ప్రజలు గ్రామ దేవతలకు వేడుకున్నారు.

సదాశివనగర్ : మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం వనబోజనాలకు తరలివెళ్లారు. అటవీ ప్రాంతాల్లో వనబోజనాలకు వెళ్లి గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. అందరు కలిసి మెలిసి బోజనాలను ఆరగించారు. ప్రతి సంవత్సరం పంటలు మొలకెత్తిన తర్వాత ఈ పండుగ నిర్వహిస్తుంటారు. మండలంలోని కల్వరాల్, తిర్మన్‌పల్లి, మర్కల్, సధాశివనగర్ ,మల్లుపేట్ తదితర గ్రామాల్లో వనభోజనాకలు తరలివెళ్లారు.

పలు గ్రామాల్లో వనభోజనాలు

లింగంపేట్: లింగంపేట మండలంలోని ఆయా గ్రామాల్లో ఆదివారం గ్రామస్తులు వన భోజనాలకు వెళ్లారు. ప్రతి ఏటా జులై మొదటి వారంలో వనభోజనాలకు వెళ్లేవారు. శ్రావణమాసం సమీపిస్తుండడంతో మండలంలోని కన్నాపూర్, పోల్కంపేట్, మేంగారం, జల్దిపల్లి, భవానిపేట్, పోతాయపల్లి, లింగంపల్లి, నల్లమడుగు, సురాయపల్లి, శెట్టిపల్లి సంగారెడ్డి, శెట్టిపల్లి అయ్యపల్లీ, బానాపూర్, లింగంపేట్, ఐలాపూర్, రాంపల్లి గ్రామాలకు చెందిన గ్రామ ప్రజలు గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతానికి వనభోజనాలకు వెళ్లారు. పచ్చని వాతావరణంలో భోజనాలు చేసి ఆటపాటలతో సందడి చేశారు.


లింగంపేట్‌లో వనభోజనాలు

ఐక్యంగా ఉంటేనే బలం

- మున్నూరు కాపులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి
- మున్నూరు కాపు సంఘం కామారెడ్డి జిల్లా అధ్యక్షులు మామిండ్ల అంజయ్య

నవతెలంగాణ-మద్నూర్

మున్నూరు కాపుల ఐక్యమత్యాన్ని విభజించే ప్రయత్నం చేస్తే సహించేది లేదని కులస్తుల మధ్య చిచ్చు పెడితే ఊరుకునేది లేదని మున్నూరు కాపు సంఘం కామారెడ్డి జిల్లా అధ్యక్షులు మామిండ్ల అంజయ్య అన్నారు. డాక్టర్ పై కేసు పెట్టినట్లు తెలిసిన సమాచారం మేరకే మద్నూర్‌కు వచ్చానని, ఎస్ఐతో మాట్లాడానని, ఈ విషయంలో ఎమ్మెల్యే షిండేను కలిసి మాట్లాడనున్నట్టు తెలిపారు. ఆదివారం మద్నూర్ మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలిపారు. మద్నూర్‌లో మున్నూరు కాపు కులస్తులంతా ఐక్యమత్యంగా ఉండటమే గత కొన్ని సంవత్సరాల కాలంగా సర్పంచ్ పదవిని గెలుచుకుంటున్నామని, ఇలాంటి ఐకమత్యమే కులానికి బలం అని తెలిపారు. మున్నూరు కాపుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వానికి వినతిపత్రం అందించడం డిమాండ్ల పరిష్కారానికి మున్నూరు కాపు కులస్తులమంతా ఐకమత్యంగా పోరాటాలు చేసి సాధించుకుందామని పిలుపునిచ్చారు. ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఐదు వేల కోట్ల రూపాయల నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు తహసీల్దార్‌లకు వినతిపత్రాలు అందజేయాలని సూచించారు. 33 జిల్లా కేంద్రాల్లో ప్రతి జిల్లా కేంద్రంలో మున్నూరు కాపు విద్యార్థిని విద్యార్థులకు హాస్టల్ భవనాల నిర్మాణం కోసం ఒక ఎకరం స్థలాన్ని కేటాయించి రెండు కోట్ల రూపాయల నిధులు కేటాయించాలని కోరారు. జనాభా ప్రాతిపదికన మహిళలకు అన్ని రంగాల్లో రాజకీయంగా సముచిత స్థానం కల్పించాలని కోకపేటలో మున్నూరు కాపులకు ప్రభుత్వం కేటాయించిన ఐదు ఎకరాల స్థలంలో ఐదు కోట్ల రూపాయలు నిధులు ఏ విధంగా సరిపోవడం లేదని జనాభా నిష్పత్తి ప్రకారం దానిని రెట్టింపు చేయాలని ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన డిమాండ్ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో మద్నూర్ మండల మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు ఎస్ గంగారం, జుక్కల్ మండల అధ్యక్షులు వినోద్, బిచ్కుంద అరవింద్, జుక్కల్ నియోజకవర్గ అధ్యక్షులు జి మొగులయ్య, మద్నూర్ గ్రామ అధ్యక్షులు డాక్టర్ బండి వార్ విజయ్, వీరితోపాటు మద్నూర్ గ్రామ సర్పంచ్ సురేష్, మాజీ జెడ్పిటిసి సభ్యులు సాహెబ్ రావు, మాజీ సింగిల్ విండో చైర్మన్ పాకల్ వార్ విజయ్, హనుమాన్లు, స్వామి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అంజయ్య

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ


పుస్తకాలు అందజేస్తున్న గంగపుత్ర సంఘం సభ్యులు

నవతెలంగాణ-రాజంపేట్

రాజంపేట్ మండల కేంద్రంలోని గంగపుత్ర సంఘం భవనంలో ఆదివారం గంగపుత్ర సంఘం రాజంపేట వారి ఆధ్వర్యంలో అధ్యక్షులు కుంట నర్సింలు అధ్యక్షతన రాజంపేట గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉన్నత పాఠశాల బాలుర, ప్రభుత్వ ఉన్నత పాఠశాల బాలికలు పాఠశాలలకు చెందినటువంటి విద్యార్థిని విద్యార్థులకు ఆదివారం నోటు పుస్తకాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గంగపుత్ర సంఘం అధ్యక్షులు కుంట నర్సింలు మాట్లాడుతూ తాము ఇదే గ్రామంలో పుట్టి పెరిగి ఇక్కడే చదువుకొని ఉద్యోగాలు సాధించి స్థిరపడ్డామని పుట్టిన ఊరికి తమ వంతుగా ఏదైనా సహాయం చేయాలని విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ చేయాలని అనుకున్నామని గంగపుత్ర సంఘం సభ్యులు ఎవరికి తోచినంత వారు విరాళాలు అందించడం ద్వారా ఇలాంటి గొప్ప కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. ఇకముందు ప్రతి సంవత్సరం ఇలాంటి కార్యక్రమాలు చేయడానికి కృషి చేస్తామని ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన సభ్యులందరికీ మరియు గ్రామ పెద్దలకుపెద్దలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆముద సౌమ్య నాగరాజు, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు జూకంటి మోహన్ రెడ్డి, రాజంపేట మత్స్య సహకార సంఘం అధ్యక్షులు కుంట చంద్రం, మాజీ ఎంపిటిసి గుర్రాల రవి, ఏఎస్ఐ రఘు, ఉపాధ్యాయుడు సతీష్, ఎస్ఎంసి చైర్మన్ నారాయణ హాజరైయ్యారు. విద్యార్థులు వారి తల్లిదండ్రులు గంగపుత్ర సంఘం సెక్రటరీ బిక్కి సతీష్, క్యాషియర్ కుంట సాయిలు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

బ్రహ్మ గర్జనకు తరలిన బ్రాహ్మణులు


బిచ్కుంద నుంచి తరలుతున్న పలువురు

నవతెలంగాణ-బిచ్కుంద/డిచ్‌పల్లి

జుక్కల్ నియోజకవర్గంలోని బిచ్కుంద, జుక్కల్, మద్నూర్, మండలాల్లోని బ్రాహ్మణులు హైదరాబాదులో తలపెట్టిన బ్రహ్మ గర్జనకి తరలి వెళ్లారు .ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, హనుమంతరావు దేశాయ్, వినోద్దేశాయ్, శ్రీధర్ రావు కులకర్ణి, లక్ష్మీకాంతరావుదేశాయ్, హజ్ గుల్ వెంకట్రావు, గిరిధర్ రావు, రామారావు, మారుతీ మహారాజ్ తదితరులున్నారు.

డిచ్‌పల్లి: బ్రహ్మ గర్జన బహిరంగ సభకు డిచ్ పల్లి, మోపాల్, ఇందల్ వాయి, నిజామాబాద్ రూరల్ మండలాలకు చెందిన బ్రాహ్మణులు ఆదివారం హైదరాబాద్‌కు తరలివెళ్లారు. వెళ్లిన వారిలో ప్రదీప్ దేశ్‌పాండే, రామదూత గోపీనాథ ఆచారి, ప్రవీణ్ దేశ్పాండే, అంబదాస్ రావు, ప్రసాదరావు, కేదార్నాథ్, రామ్, శ్యామ్ ,సాయి, సంపత్ ,డాక్టర్ లక్ష్మణ్ రాజు, వడియాలు రవికుమార్, దేవిదాస్ రావు, తోపాటు తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ పార్టీలో పలువురు చేరిక


ఎమ్మెల్యే సమక్షంలో చేరిన పలువురు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి నియోజకవర్గ మండలంలోని రంగోలివాడి గ్రామ సర్పంచ్ వార్డ్ మెంబర్లు ఇతర నాయకులు కార్యకర్తలు సుమారు 50 మంది బిజెపి పార్టీ నుంచి టిఆర్ఎస్ పార్టీలోకి బీఆర్ఎస్ చేరినట్టు నాయకులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలతో పాటు ఎమ్మెల్యే తీరుతో ఆయన అడుగుజాడల్లో నడిచేందుకు టిఆర్ఎస్ పార్టీలో చేరినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రెసిడెంట్ ఏఎంసీ చైర్మన్ ఎంపీపీ వైస్ ఎంపీపీ సర్పంచులు సొసైటీ చైర్మన్ పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ కృషి

- అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన విప్

నవతెలంగాణ-దోమకొండ

రాష్ట్ర ప్రభుత్వం బోనాల పండగ ను వైభవంగా నిర్వహిస్తుందని ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్ అన్నారు. దోమకొండ మండల కేంద్రంలోని చాముండేశ్వరి ఆలయంలో మహంకాళి బోనాల పండగ సందర్భంగా ఆదివారం ప్రభుత్వ గంప గోవర్ధన్ అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తరువాత బోనాల పండగ ను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందని, దేవాలయల అభివృద్ధికి సీఎం కెసిఆర్ నిధులు మంజూరు చేస్తున్నారని తెలిపారు. అనంతరం విప్ గంపగోవర్ధన్ ను ఆలయం కమిటీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు శాలువాతో సన్మానం చేశారు. లింగుపల్లి గ్రామం లో మున్నూరు కాపు కమ్యూనిటీ భవనం నిర్మాణం కోసం భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని, పాడి పంటలు, పండాలని ఆరోగ్యంగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ముజీబోద్దీన్, గ్రంథాలయ శాఖ చైర్మన్ ఉన్న రాజేశ్వర్, దోమకొండ జడ్పిటిసి తీగల తిరుమల గౌడ్, సిడిసి చైర్మన్ ఐరేణి నరసయ్య, మండల అధ్యక్షులు గంద్ర మధుసూదన్ రావు, ఎంపీపీ కానుగంటి శారద నాగరాజు, సర్పంచ్ నల్లపు అంజలి శ్రీనివాస్,ఆలయ కమిటీ చైర్మన్ పాలకుర్తి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.


విప్ గంపగోవర్ధన్‌ను సన్మానించిన ఆలయ కమిటీ

కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షులుగా సుదర్శన్


నియామకపత్రం అందుకున్న సుదర్శన్

నవతెలంగాణ-భిక్కనూర్

కాంగ్రెస్ పార్టీ భిక్కనూర్ మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులుగా బల్యాల సుదర్శన్ మరోసారి నియమితులయ్యారు. నియామక పత్రాన్ని మాజీమంత్రి షబ్బీర్ అలీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి తనకు మరోసారి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష పదవి ఇచ్చినందుకు మాజీ మంత్రి షబ్బీర్ అలీకి, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి తన సాయశక్తులా కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కైలాష్ శ్రీనివాస్ , టీపీసీసీ బద్దం ఇంద్రకరణ్ రెడ్డి , ఉపాధ్యక్షులు మద్ది చంద్రకాంత్ రెడ్డి ,మండల కాంగ్రెస్ అధ్యక్షులు భీమ్ రెడ్డి , సీనియర్ నాయకులు లింబద్రి, సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వరాజ్య స్థాపనే లక్ష్యం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

స్వరాజ్య స్థాపనే లక్ష్యమని ధర్మసమాజ్ పార్టీ మండల కోఆర్డినేటర్ మోహన్ అన్నారు. ఆదివారం మండలంలోని పడకల్ గ్రామంలో తెలంగాణ రాష్ట్రంలో ఉన్న మూడు కోట్ల యాభై లక్షల మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రజలు తమ స్వరాజ్యాన్ని స్థాపించుకోవాలని ధర్మసమాజ్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ విశారదన్ మహరాజ్ చేసిన 10,000 కిలోమీటర్ల స్వరాజ్య పాదయాత్ర నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి మండలం పడకల్ గ్రామానికి చేరుకొని ఆదివారంతో సంవత్సరం పూర్తి అయిన సందర్భంగా పాదయాత్రకు గుర్తుగా ఏర్పాటుచేసిన శిలాఫలకానికి రంగుల అద్ది పూలు సమర్పించి మరొక్కసారి పాదయాత్రను, పాదయాత్ర లక్ష్యాన్ని నాయకులు గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో డి.ఎస్.పి ప్రచార కమిటీ సభ్యులు మహేష్ మహేరాజ్, ధర్మ సమాజ్ పార్టీ ప్రచార కమిటీ సభ్యులు రవి, ప్రసాద్, మనోజ్, సురేష్, మేకల అశోక్, డాక్టర్ వంశీ, శ్రీకాంత్, ఆకాష్, అరుణ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

మంధర్నలో లబ్దిదారుల సర్వే

నవతెలంగాణ-బోధన్

సాలూర మండలం మంధర్న గ్రామంలో ఇండ్లులేని నిరుపేదలు ఆదివారం ప్రభుత్వ స్థలంలో కబ్జాలో ఉండి ఇంటి నిర్మాణానికి దరఖాస్తు చేసుకోవడంతో వారిలో అర్హులైన లబ్దిదారులను గుర్తించడానికి బోధన్ ఆర్డీఓ రాజేశ్వర్ ఆదివారం గ్రామంలో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ స్థలంలో తాత్కాలిక నివాసాలు ఏర్పరుచుకుని ఉన్నవారు ప్రభుత్వ జీఓ 58, 59 ప్రకారం కబ్జాలో ఉన్న స్థలానికి పట్టా ఇవ్వాలని దరఖాస్తులు చేసుకోవడంతో అర్హులైన వారిని గుర్తించడానికి సర్వే చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా 250 దరఖాస్తులు రావడంతో వాటిపై సర్వే చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట సాలూర తహసీల్దార్ పడాల మమత, ఆర్ఐ గంగాధర్, సర్పంచ్ రావుబా గంగాధర్, గ్రామస్థులున్నారు.

ధర్పల్లిలో సెంట్రల్ లైటింగ్ పనులు

- నెరవేరనున్న ధర్పల్లి వాసుల దశాబ్దాల కల
- బాజిరెడ్డి ప్రత్యేక చొరవతో రూ.6.5 కోట్ల నిధులు

నవతెలంగాణ-ధర్పల్లి

ధర్పల్లి మండల కేంద్రానికి చెందిన ప్రజల దశాబ్ది కల నెరవేరనుంది. ఇందుకు రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ప్రత్యేక చొరవతో గ్రామస్థులకు ఇచ్చిన మాటకు ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి ప్రశాంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి మెప్పించి మొదటగా 1.1కిలోమీటర్ పనులకు గానూ రూ.ఆరున్నర కోట్ల నిధులు మంజూరు చేయించారు. కాగా చేపట్టబోయే పనులకు ఆదివారం రహదారుల చీఫ్ ఇంజినీర్ జె.మోహన్ నాయక్, జిల్లా ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, ఆర్‌అండ్‌బీ అధికారి వై.సురేష్‌లు, స్థానిక ఎంపీపీ నల్ల సారిక హన్మంత్ రెడ్డి, సర్పంచ్ ఆర్మూర్ పెద్ద బాలరాజ్‌లతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండల కేంద్రానికి మంజూరైన ఆరున్నర కోట్లతో స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి పెద్దమ్మ ఆలయ సమీపం వరకు 1.1 కిలో మీటర్ పనులు చేపట్టడం జరుగుతుందని, ఇందుకు గానూ ప్రస్తుతం ఉన్న రోడ్డుకు మధ్యలో నుంచి ఇరువైపులా 35 ఫీట్ల రహదారి అవసరం ఉంటుందని, మొత్తం 70 ఫీట్ల 4 లైన్ల రోడ్డు, మధ్యలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రెండు రోజుల్లో తమ అధికారులు రోడ్డు విస్తరణ చేపట్టబోయే రోడ్డు మ్యాప్‌ను తయారు చేస్తారని అనంతరం ప్రభుత్వానికి నివేదించి, నెలలోపు టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభిస్తామని తెలిపారు. అలాగే భీంగల్ వైపు గ్రామ చివర మరో అర కిలోమీటర్ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. చేపట్టబోయే పనులకు గ్రామ ప్రజా ప్రతినిధులు, ప్రజలు సమన్వయంతో సహకారం అందించి పనులు పూర్తి చేయించుకునే బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రూరల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టీ.సుధీర్, ధర్పల్లి అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆర్.మనోహర్. ఏఈ సిరికొండ వి.ప్రవీణ్‌కుమార్, ప్రజాప్రతినిధులు, సొసైటీ చైర్మెన్ చెలిమేల మల్లికార్జున్, కోఆప్షన్ సభ్యుడు అబ్దుల్ మజీద్, పుప్పాల సుభాష్, పోతరాజు, పరికీటీ సురేష్ తదితరులున్నారు.


పనుల కోసం పరిశీలిస్తున్న చేస్తున్న అధికారులు

ముఖ్యమంత్రి సహాయనిధి.. వరం

- ధర్పల్లి జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్


సీఎం సహాయనిధి చెక్కు అందజేత

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ముఖ్యమంత్రి సహాయనిధి.. పేదలకు వరమని ధర్పల్లి జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్ అన్నారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని డిచ్‌పల్లి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన చెక్కులను ఆదివారం నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బాజిరెడ్డి జగన్మోహన్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసి దాసరి ఇందిరా లక్ష్మీ నర్సయ్య, మండల అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు సాయిలు, సీనియర్ నాయకులు, మాజీ మండల అధ్యక్షులు శక్కరికొండ కృష్ణ, ఒడ్డెం నర్సయ్య, వివిధ గ్రామాల సర్పంచులు నర్సయ్య, జగదీష్, మోహమ్మద్ యూసఫ్, సర్పంచులు, ఎంపీటీసీలు, లబ్దిదారులు తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం

నవతెలంగాణ-డిచ్‌పల్లి/బోధన్

మండల కేంద్రంలోని తెలంగాణ యూనివర్సిటీలో ఆదివారం ఏబీవీపీ అధ్యక్షుడు, రాష్ట్ర కన్వీనర్ శివ ఆధ్వర్యంలో తెలంగాణ యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ చౌరస్తా వద్ద అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ 75వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జెండా ఎగురవేసి, హెల్త్ సెంటర్లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ విద్యార్థులు పాల్గొన్నారు.


డిచ్‌పల్లి : వేడుకల్లో నాయకులు

ఎస్సీ హాస్టల్‌లో ఏబీవీపీ దినోత్సవం..

బోధన్ :బోధన్ పట్టంలోని శక్కర్‌నగర్‌లో గల ఎస్సీ హాస్టల్‌లో ఆదివారం ఏబీవీపీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకులు అడ్లూరి శ్రీనివాస్ విద్యార్థులకు సరస్వతి, స్వామి వివేకానంద, భారతమాత చిత్రపటాలను అందించి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు సూర్యకుమార్, బోధన్ పట్టణ అధ్యక్షులు లక్ష్మణ్ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్‌గా ఈరెంటి లింగం నియమాకం

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని బాపునగర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కిసాన్ సెల్ మండలాధ్యక్షులుగా పనిచేస్తున్న ఈరెంటి లింగమును కాంగ్రెస్ కమిటీ ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్‌గా నియమిస్తూ మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి నియమాకపత్రాన్ని లింగంకు అందజేశారు. నిజామాబాద్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో లింగమును ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్‌గా నియామకం చేసినట్లు మాజీమంత్రి సుదర్శన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడారు రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతనానికి కృషి చేస్తానని లింగం తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎడపల్లి మండల అధ్యక్షులు పులి శ్రీనివాస్ రావు, తనకలాన్ మాజీ సర్పంచ్ పోచయ్య, నెహ్రూనగర్ సీనియర్ నాయకులు కాజా, యూత్ కాంగ్రెస్ పార్టీ నాయకులు దొడ్ల రవీందర్ రెడ్డి, రత్నాకర్, ఐదేళ్ల నవీన్ తదితరులున్నారు.

పరిశుభ్రమైన మంచినీటిని తాగాలి


మాట్లాడుతున్న వైద్యాధికారి

నవతెలంగాణ-ఎడపల్లి

గ్రామీణ ప్రాంత ప్రజలు పరిశుభ్రమైన మంచినీటిని తప్పకుండా తాగాలని అప్పుడే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని ఎడపల్లి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కంటి వెలుగు ఇన్చార్జి వైద్యాధికారి రాజకుమార్ అన్నారు. మండలంలోని తానాకలాన్ గ్రామంలో ఆయన కలుషిత నీటిపై మహిళలకు అవగాహన కల్పించారు. కలుషిత నీరు తాగడం వల్ల రోగాలు సోకే ప్రమాదం ఉందని ఆయన గుర్తు చేశారు. వర్షాకాలంలో తస్మా బ్యాక్టీరియా, దోమలు నీటిలో పెరగడం వలన మనకు మలేరియా, డెంగ్యూ, కలరా, టైఫాయిడ్, పచ్చకామెర్లు (జాండీస్), వాంతులు, విరేచనాలు ఇతర వ్యాధులు రావొచ్చని ఆయన అన్నారు. వర్షాకాలంలో నీరు నిలువకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని వడపోసి తాగాలన్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో కలుషిత నీరు ప్రమాదకరమని అందుకు మహిళలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన వెంట ఏఎన్ఎం దేవకరణ, ఆశావర్కర్లు, గ్రామ పెద్దలు మాజీ సర్పంచ్ యాదగిరిగౌడ్, మహిళలు తదితరులు ఉన్నారు.

మెట్రో నగరాలకు ధీటుగా 'శ్రీ చక్ర' లో వైద్యం


శ్రీ చక్ర ఆస్పత్రిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ నగరంలో నూతన ఒరవడితో మెట్రో నగరాలకు ధీటుగా నిజామాబాద్ ప్రజలకు వైద్యం అందించాలని సదుద్దేశంతో శ్రీ చక్ర ఆసుపత్రిని ప్రారంభించినట్లు ఆసుపత్రి యాజమాన్యం తెలిపింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా, నగర మేయర్ దండు నీతు కిరణ్ హాజరై ఆస్పత్రిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ నిజామాబాద్ నగరంలో జిల్లా ప్రజలకు వైద్య మరింత చేరువ చేయాలని ఆలోచనతోపాటు పేద ప్రజలకు కూడా నగరంలోని కార్పొరేట్ వైద్యం అందించడం సంతోషించాల్సిన విషయమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ నీలి రాంచందర్, ఐఎంఏ సెక్రటరీ డాక్టర్ జలగం తిరుపతిరావు, ఆసుపత్రి యాజమాన్యం జనరల్ ఫిజీషియన్ డాక్టర్ టి.విశ్వతేజ రెడ్డి, న్యూరో సర్జన్ డాక్టర్ కె.మేఘరాజ్, ఆర్థో డాక్టర్ బి.హర్షవర్ధన్‌గౌడ్, ఈఎన్టీ డాక్టర్ ఎం.అన్వేష్ కృష్ణ, ఫిజియోథెరపీ డాక్టర్ శివకుమార్, మేనేజ్‌మెంట్ పవన్ గౌడ్, రాజేష్ ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సుచి, శుభ్రత


మొక్కలు నాటుతున్న సీఐ, పలువురు

నవతెలంగాణ-ఆర్మూర్

రోటరీ క్లబ్ ఆఫ్ ఆధ్వర్యంలో ప్రతినెల రెండవ ఆదివారం 'ఆదివారం - అరగంట' సుచి శుభ్రత కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా రాంనగర్ కాలనీలోని రామాలయంలో ముఖ్య అతిథి పట్టణ సీఐ సురేష్ బాబు, అధ్యక్షుడు గోపికృష్ణ పట్వారి, రోటరీ సభ్యులు కలిసి పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటి రామాలయం ఆవరణలో పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి సి.ఐ సురేష్ బాబు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తన వంతు బాధ్యతగా తన ఇంటి ఆవరణలో పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ పర్యావరణ పరిరక్షణ అందరూ కాపాడాలని వారు సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి తులసి పట్వారి, కోశాధికారి లక్ష్మీనారాయణ, స్థానిక కౌన్సిలర్ గంగామోహన్ చక్రు, పద్మ మురళి, రాజ్‌కుమార్ అగర్వాల్, ఎం.కె.నరేందర్, రాన ఆనంద్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ డిక్లరేషన్‌ను అమలు చేస్తాం

- రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేసి తీరుతాం
- బీఆర్ఎస్ పాలనలో విచ్చలవిడిగా అవినీతి
- మాజీ ఎమ్మెల్సీ భూపతిరెడ్డి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ప్రజల జీవితాలలో వెలుగులు నింపేందుకే కాంగ్రెస్ డిక్లరేషన్‌ను ప్రజల ముందు పెట్టామని.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేసి తీరుతామని మాజీ ఎమ్మెల్సీ భూపతిరెడ్డి అన్నారు. గతంలో రుణమాఫీ ఒకే సారి చేసి చుపించామని, బీఆర్ఎస్ పాలనలో విచ్చలవిడిగా అవినీతి రాజ్యమేలుతుందని చెప్పారు. ఆదివారం ఇందల్‌వాయి మండలంలోని మేగ్య నాయక్ తండాలో గడప గడపకూ కాంగ్రెస్.. పల్లెపల్లెకూ భూపతిరెడ్డి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అంతకు ముందు సేవాలాల్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.500లకే గ్యాస్ సిలిండర్ అందజేస్తామని, వృద్ధులు, వితంతువులకు 4000 పెన్షన్, నెలకు 4000 చొప్పున నిరుద్యోగ భృతి, అమరుల తల్లిదండ్రులకు రూ.25వేల పెన్షన్ కుటుంబంలో ఒకరికి, ఇందిరమ్మ ఇంటికి 5 లక్షల సహాయం, ఆరోగ్య శ్రీ పథకంలో భాగంగా 5లక్షల వరకు ఉచిత వైద్య చికిత్స, వెనుకబడిన వర్గాల విద్యార్థులందరికీ ఫీజు రియింబర్స్‌మెంట్, భూమిలేని నిరుపేదలకు రూ.12వేల సహాయం ప్రతి ఏడాది, 18 ఏండ్లు పైబడిన విద్యార్థినులకు ఎలక్ట్రిక్ స్కూటీ, రైతులకు, కౌలు రైతులకు ఎకరాకు రూ.15 వేల సహాయం, భూమి లేని నిరుపేదలకు సహాయం, ప్రతి ఏడాది రూ.12వేలు, ప్రభుత్వం వచ్చిన మొదటి ఏడాదికే 2లక్షల ఉద్యోగాలు, మహిళలకు రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత బస్సు సౌకర్యం, వరికి గిట్టుబాటు ధర క్వింటాకు రూ.2500, పోడు భూమి రైతులకు పట్టాల పంపిణీ, ధరణి రద్దు చేస్తామని డాక్టర్ భూపతి రెడ్డి పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలు, అమరవీరుల ఆశయాలకు అనుగుణంగా తెలంగాణ రాష్ట్రాన్ని కాంగ్రెస్ ఇచ్చిందని, కేసీఆర్ పాలనలో తెలంగాణ రైతులు, ప్రజలు దగా పడ్డారని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయానికి పూర్వ వైభవం తెస్తామన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు మోత్యారి నవీన్ గౌడ్, డిసిసి డెలిగేట్ వెంకటరెడ్డి, ఉపసర్పంచ్ బైరయ్య, నవీన్ గౌడ్, అంబర్ సింగ్, బాబియా నాయక్, మొనియా నాయక్, సరంగ్ నాయక్, గోపాల్ నాయక్, గంగారాం, మోతీరాం, లారీ గంగారెడ్డి, బాబురావు, గంగామని, రాజన్న, తోట ప్రకాష్, సాయందర్, శంషుద్దీన్, యాచారం సాయిలు, నర్సయ్య, నారాయణ, వసంతరావు, భూమన్న మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ భూపతిరెడ్డి

పట్టణంలో 'స్వచ్ఛ కాలనీ-సమైక్య కాలనీ'

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని జర్నలిస్ట్ కాలనీలో అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గోసికొండ అశోక్ ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛ కాలనీ సమైక్య కాలనీ కార్యక్రమాన్ని కమిటీ ప్రతినిధులు, కాలనీవాసులు కలిసి ఉత్సాహంగా నిర్వహించారు. అభివృద్ధి కమిటీ ప్రతినిధులు, కాలనీవాసులు ఉదయం రెండు గంటల పాటు శ్రమదానం చేసి కాలనీలో మురుగు కాలువలను శుభ్రం చేశారు. కమిటీ ప్రతినిధులు, కాలనీవాసులు చేతులకు గ్లౌజులు, ముఖాలకు మాస్కులు ధరించి మురుగు కాలువలపై, రోడ్లపై బ్లీచింగ్ పౌడర్ చల్లారు. మురుగు కాలువలలో నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న ప్లాస్టిక్ కవర్లు, రాళ్లను, చెత్తా చెదారాన్ని తొలగించి, పూడిక తీసి మురుగు నీరు వెళ్ళిపోయేలా చేశారు. పిచ్చి మొక్కలు, చెత్తా చెదారాన్ని తొలగించారు. జర్నలిస్ట్ కాలనీని పరిశుభ్రంగా, వ్యాధుల రహిత కాలనీగా ఉంచడానికి గత ఏడు వారాలుగా ప్రతి ఆదివారం స్వచ్ఛ కాలనీ సమైక్య కాలనీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గోసికొండ అశోక్ తెలిపారు. కాలనీ వాసులు తమ ఇళ్ళ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, ప్లాస్టిక్ కవర్లను మురుగు కాలువలలో వేయొద్దని ఆయన సూచించారు. జర్నలిస్ట్ కాలనీని ఆదర్శ కాలనీగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని అశోక్ పేర్కొన్నారు. అభివృద్ధి కమిటీ ప్రధాన కార్యదర్శి బి.కమలాకర్, ఉపాధ్యక్షులు కొక్కెర భూమన్న, సుంకే శ్రీనివాస్, కార్యదర్శులు కొంతం రాజు, రాజ్ కుమార్, ఎస్సారెస్పీ డీఈ గణేశ్, ఎల్టీ కుమార్, ఎర్ర భూమయ్య, విశ్రాంత విద్యాధికారి ఎ.లక్ష్మయ్య, మ్యాకల అశోక్, మ్యాకల దినేష్, సంఘం నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.


మురుగు కాలువలను శుభ్రం చేస్తున్న ప్రతినిధులు

మహిళా ప్రయాణికులకు, సీనియర్ సిటిజన్‌లకు ఆర్టీసీ ఆఫర్లు

- డిపో మేనేజర్ కవిత

నవతెలంగాణ-ఆర్మూర్

మహిళ ప్రయాణికులకు, సీనియర్ సిటిజన్‌లకు ఆర్టీసీ ఆఫర్లు ప్రకటించిందని డిపో మేనేజర్ కవిత తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రయాణికుల ఆర్థిక భారం తగ్గించేందుకు 55 నుంచి 60కి కిలోమీటర్ల పరిధిలో 'టి-9 టికెట్' సమయాల్లో మార్పులు చేసిందని పేర్కొన్నారు. పల్లె వెలుగు బస్సుల్లో ప్రయాణించే మహిళలు, సీనియర్ సిటిజన్ల కోసం తొలిసారిగా అందుబాటులోకి తెచ్చిన, ఈ టికెట్ ధర రూ.100 అని తెలిపారు. ఉదయం 9 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు వర్తిస్తుందని, గతంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు చెల్లుబాటు అయ్యేదని తెలిపారు. ప్రయాణికుల నుండి వచ్చిన అభ్యర్థనల మేరకు, ఈ టికెట్‌ను సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 9గంటల వరకు పెంచుతూ సంస్థ నిర్ణయం తీసుకుందని తిరుగు ప్రయాణంలో ఎక్స్‌ప్రెస్ బస్సులో కూడా రూ.20తో కాంబినేషన్, టికెట్టు చెల్లించి కూడా ప్రయాణించే సదుపాయం కల్పించారని పేర్కొన్నారు. కావున దీనివలన ప్రయాణికులకు 20 రూపాయల నుంచి 40 రూపాయలు వరకు మిగులుబాటు అవుతుందని, కనుక ఆర్మూర్ డిపో పరిధిలోని ప్రయాణికులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని డిపో మేనేజర్ కవిత కోరారు.



దళితుల పట్ల వివక్ష చూపొద్దు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

దళితుల పట్ల వివక్ష చూపడం శోచనీయమని మాల మహానాడు జిల్లా అధ్యక్షులు అనంపల్లి ఎల్లయ్య అన్నారు. గజ్వేల్ నియోజకవర్గ పరిధిలోని జగదేవ్పూర్ మండలం తిమ్మాపూర్‌లో జరిగిన కులవివక్షత ఘటనపై జిల్లా మాల వధూవరుల కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎల్లయ్య మాట్లాడుతూ స్వయంగా మన ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాంతంలో దళితులు హేయిర్ సెలూన్‌లో క్షవరం చేసుకోవడానికి వాటి నిర్వాహకులు (మంగళివారు) షాప్‌లోకి రానివ్వడం లేదని, కుర్చీలో కూర్చోనివ్వకుండా దళిత వాడలోని చెట్టుకింద కూర్చుంటే క్షవరం చేస్తామని చెప్పడం ఏంటని ప్రశ్నించారు. స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలైనా దళితుల పట్ల ఈ వివక్ష చూపడం శోచనీయమని అన్నారు. ఈ చర్యకు పాల్పడిన గ్రామపెద్దలు, వారికి సహకరించిన వారందరి మీద ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి వారిని అరెస్టు చేయవలసిందిగా జిల్లా మాల మహానాడు డిమాండ్ చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎడ్ల నాగరాజు, జిల్లా కార్యదర్శి నాంది వినయ్, ఉపాధ్యక్షులు బత్తుల కిష్టయ్య, సలోంకే విజయ్, సహాయ కార్యదర్శి దయానంద్ సౌస్ కాంబ్లీ, పట్టణ కార్యదర్శి బట్టి గంగాధర్, కోశాధికారి సిద్ధం రాజేందర్, ప్రచార కార్యదర్శి కొట్టు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎల్లయ్య


బాన్సువాడ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం

- జడ్పీటీసీ, జడ్పీ ఫ్లోర్ లీడర్ అంబర్‌సింగ్

నవతెలంగాణ-వర్ని

బాన్సువాడ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని గెలిపించడానికి యువత పార్టీ కోసం పనిచేస్తుందని చందూర్ జడ్పీటీసీ, జడ్పీ ఫ్లోర్ లీడర్ అంబర్ సింగ్ అన్నారు. ఆదివారం అయన పార్టీ సభ్యత్వాల నమోదు కార్యక్రమంలో ప్రధాన పాత్ర పోషించిన ఎన్రోలర్స్ సేవలను గుర్తించి నియోజకవర్గంలోని ప్రతి ఒక్క ఎన్రోలర్‌ని ప్రోత్సహిస్తున్నామని, వారి కష్టానికి పారితోషికాన్ని అందించి అభినందించారు. కార్యక్రమంలో నసురుల్లాబాద్ మండల అధ్యక్షులు నందు, వైస్ ఎంపీపీ దశ గౌడ్, జేకే తాండా మాజీ సర్పంచ్ రూప్ సింగ్, చందూర్ గ్రామ అధ్యక్షులు గుర్ల మల్లయ్య, సాయిలు, భాస్కర్ గౌడ్, బస్వయ్య, ఇబ్రహీంపేట్ సాయిలు, జీవన్, అబ్దుల్ నబీ, తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాలు పరిశీలించిన సీపీఐ నాయకులు


మరుగుదొడ్లను చూపుతున్న నాయకులు

నవతెలంగాణ-కోటగిరి

మండల కేంద్రంలో సీపీఐ పార్టీ బృందం ఎస్సీ, బీసీ వసతి గృహాలను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి ఏ విట్టల్‌గౌడ్ మాట్లాడుతూ.. ప్రధానంగా బీసీ హాస్టల్లో మరుగుదొడ్లకు డోర్లు సరిగ్గా లేకపోవడం, దుర్వాసనతో కంపు కొడుతున్నాయని, ఇప్పటివరకు ఎస్సీ హాస్టల్లో పిల్లలకు దుప్పట్లు రాకపోవడం పిల్లల సంరక్షణకు గత సంవత్సరం నుంచి వాచ్ మెన్ లేకపోవడంతో పిల్లలు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు హాస్టళ్లను సందర్శించి వారి సమస్యలను పరిష్కరించాలని లేనియెడల సమస్యలపై ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. మండల నాయకులు నల్ల గంగాధర్, నీలి దత్తు, హనుమాండ్లు, కప్ప రవి, సోమ రాములు తదితరులు పాల్గొన్నారు.